క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: పట్టణంతోపాటు ఖానాపూర్, కడెం, పెంబి మండలాల్లోని సబ్‌స్టేషన్ల పరి ధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సత్తనపల్లి, బీర్నంది, పాతఎల్లాపూర్, లింగాపూర్, పెంబి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. ప్రజలు గమనించాలని కోరారు. పట్టణంలోని గాంధీనగర్‌లోని అమృత్ స్కీం వాటర్ ట్యాంక్ నిర్మాణంలో భాగంగా పెంబి ఫీడర్‌లైన్ షిఫ్టింగ్, ఇతర ఫీడర్లలో చెట్ల కొమ్మల తొలగింపులు ఉంటాయన్నారు.
మామడ: మండలంలోని దిమ్మదుర్తి, పొన్కల్, చింతల్‌చాంద సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి పంపిణీ చేస్తున్న గంగన్న

కడెం:మండలకేంద్రంతోపాటు మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ బస్టాప్ వద్ద శుక్రవారం మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న అంబలి కేంద్రం ప్రారంభించారు. ప్రజలకు ఏటా వేసవిలో దప్పిక, ఆకలి తీర్చేందుకు తనవంతుగా చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ భూషణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, శంకర్, రమేశ్, రాజు, రాజేశ్వర్ తదితరులున్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రాజు



దస్తురాబాద్: బీజేపీ మండలాధ్యక్షుడిగా మండలంలోని గోడిసీర్యాల గ్రామానికి చెందిన పానుగంటి రాజును నియమించినట్లు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలాధ్యక్షుడిగా పని చేసిన కొడిమేల లక్ష్మణ్‌ను జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నియమించామన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా రాము

భైంసాటౌన్: బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షుడిగా రావుల రాము నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ నియామక ప్రకటన విడుదల చేశారు. పట్టణాధ్యక్షుడిగా ఉన్న మల్లేశ్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలువురు బీజేపీ నాయకులు వీరికి అభినందనలు తెలిపారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా నవీన్



కుంటాల: కుంటాల మండల బీజేపీ కన్వీనర్‌గా పసుల నవీన్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ప్రకటించారు. శుక్రవారం కుంటాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కౌట్టి అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ గజ్జారాం యాదవ్ ఆయనను సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నవీన్ పేర్కొన్నారు.

డీఎల్‌పీవో పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అజీజ్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్మల్ డీఎల్‌పీవో అజీజ్ పర్యటించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు అందించాలి

ముధోల్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు తమ పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో శివకుమార్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 14వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జిరాక్స్‌లను అందించనివారు వెంటనే అందజేయాలని సూచించారు.

పదవికి రాజీనామా

కుంటాల: బీసీ బీసీ మోర్చా కుంటాల మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీబ్బిల దత్తాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు సమాచారం ఇవ్వకుండా పార్టీ మండల కన్వీనర్‌ను నియమించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు

నాలుగు నెలలకే అధ్వానం..

- నాణ్యతలేమితో దెబ్బతిన్న సీసీరోడ్లు
- ఇందిరమ్మ కాలనీలో రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



చాకలి గంగారాం ఇంటి ఎదుట సీసీ రోడ్డు దుస్థితి



ఇందిరమ్మ కాలనీలో మాజీ ఎంపీటీసీ ఇంటి ఎదుట కంకర తేలిన రోడ్డు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో పలు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత కరువైంది. సంబంధిత అధికారులు పనులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం పనుల కారణంగా నిర్మించిన నాలుగు నెలలకే సీసీ రోడ్లపై కంకర తేలడంతో నడిచేందుకు ఇబ్బంది పడుతున్నామని.. వీటి కన్నా మట్టిరోడ్లే నయమని ఇందిరమ్మ కాలనీవాసులు వాపోతున్నారు.

గ్రామంలో చేపట్టిన రోడ్ల వివరాలు..

- నాలుగు నెల కిందట ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.5లక్షలతో రత్నపురం గంగాధర్ ఇంటి నుంచి దాసరి భోజన్న ఇంటి వరకు(సుమారు 80 మీటర్లు) సీసీ రోడ్డు నిర్మించారు. అప్పటి పంచాయతీరాజ్ ఏఈ శరత్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.
- ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.5లక్షలతో రాజన్న ఇంటి నుంచి దాసరి గంగాధర్ ఇంటి వరకు (80మీటర్లు) సీసీరోడ్డు నిర్మించారు.
- 2023లో దాదాపు నాలుగుచోట్ల (350 మీటర్లు) శివాలయం పక్క నుంచి కాస ప్రవీణ్ ఇంటివరకు, అలాగే కె.మహేందర్ ఇంటి నుంచి దాసరి భోజన్న ఇంటివరకు నిర్మించిన ఈ రోడ్డును సుమారు రూ.25లక్షలతో నిర్మించారు.

బిల్లులు మాత్రం..

సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత కొరవడినా అధికారులు మాత్రం సంబంధిత కాంట్రాక్టర్లకు 90శాతం బిల్లులు చెల్లించడం గమనార్హం. మిగిలిన 10శాతం బిల్లులు కూడా విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్మించిన దాదాపు నాలుగు సీసీ రోడ్ల పరిస్థితి ఇలానే ఉంది. వాటిపై చాలా చోట్ల కంకర తేలి సీసీ రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. వచ్చేది వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురిస్తే సీసీ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

మొరం కూడా పోయలేదు..

సీసీ రోడ్లు నిర్మించిన తర్వాత రెండువైపులా మొరం పోయాల్సి ఉంటుంది. కానీ కాలనీలో ఒక్క సీసీరోడ్డుకు సైతం మొరం పోయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డు దిగి పైకి ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

సీసీరోడ్ల నిర్మాణానంతరం క్యూరింగ్ సరిగా చేయలేదు. అందుకే రోడ్లపై కంకర తేలింది. ఈపరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం. రెండు చోట్ల నిర్మించిన సీసీరోడ్లకు సంబంధించి ఇంకా 10శాతం నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం.
– దేవిదాస్, పీఆర్ ఏఈ, సారంగాపూర్

కాలనీలో సౌకర్యాలు కరువు..

సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ నిర్మించి దాదాపు 15 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఎక్కడా డ్రెయినేజీ నిర్మించలేదు. దీంతో ఎక్కడి మురికినీరు అక్కడే నిలిచి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

'కాంగ్రెస్ ఒత్తిడితోనే కులగణన'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించిందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. కేంద్రం జనాభా లెక్కలతోపాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించడం కాంగ్రెస్ విజయంగా భావిస్తూ శుక్రవారం శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణన చేపట్టాలని ఎక్కువ వినతులు అందాయని.. ఈ కారణంతో బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విజయం సాధించారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారి తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి.. అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం పొందినట్లు గుర్తు చేశారు. త్వరలోనే పార్లమెంటులో కూడా ఈ బిల్లు ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమలింగారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, సాద సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, చిలక రమణ, విలాస్ పాల్గొన్నారు.

చెరువు మట్టి కోసం అనుమతివ్వాలి

మామడ: మండలంలోని నల్దుర్తి అటవీప్రాంతంలో ఉన్న తుర్కం చెరువు నుంచి నల్ల మట్టిని తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని నల్దుర్తి గ్రామస్తులు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో నిర్మల్‌లో అటవీశాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. సీసీఎఫ్ శరవణ్, డీఎఫ్ఓ నాగిని భానులను కలిసి సమస్య వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని అటవీశాఖ అధికారులు.. గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పడాల శ్రీనివాస్, వెంకటేశ్, శంకర్, రవి, మహేందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



భైంసారూరల్ : కామోల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఆనంద్‌రావు పటేల్



సారంగపూర్ : చించోలి(బి)లో ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్ హాదీ

భైంసారూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసే వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర అందిస్తామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని దేగాం, ఇలేగాం, కుంసర, కామోల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రజాక్, నాయకులు సొలంకి భీంరావు తదితరులు ఉన్నారు.
సారంగపూర్: ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బీరవెల్లి, ప్యారమూర్, తాండ్ర(జి), వైకుంఠాపూర్, వంజర్, మలక్‌చించోలి, ధని, గోపాల్‌పేట్, చించోలి(బి) గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, రమేశ్, మధుకర్, భూమారెడ్డి, ముత్యంరెడ్డి, మురళి, సాయన్న, ప్రేమానంద్, భోజన్న, సూర్యం, సత్యం, బషీర్ తదితరులు ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



అడెల్లి ఫంక్షన్‌హాల్‌లో సమావేశమైన 1991-92 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు

సారంగపూర్: మండలంలోని జామ్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం ఇదే మండలంలోని అడెల్లి ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ఈసందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు, వృత్తి, కుటుంబవిషయాలు తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

భూమిపూజ

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి)లో పీఎం శ్రీ యోజన పథకం కింద రూ.14.5 లక్షలతో మంజూరైన ఆధునిక కంప్యూటర్ సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శుక్రవారం స్థానిక నాయకులు భూమి పూజ చేశారు. ఈ ల్యాబ్‌తో పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుంది. జాదవ్ కిశోర్, అరుణ్‌లాల్, డాక్టర్ ఉత్తం, చెన్న మహేశ్, కాంట్రాక్టర్ వినోద్‌రెడ్డి, బాశెట్టి విజయ్‌కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

భగవద్రామానుజుల జయంతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయంలో శుక్రవారం భగవద్రామానుజుల 1008వ జయంతిని శ్రీవైష్ణవ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం రామానుజుల మూలవిరాట్, ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం జరిపించారు. తిరుప్పావై, రామానుజనూత్తాది, ధాటిపంచకం, మౌక్తికములు అనుసంధానం చేశారు. అర్చకులు ఆచార్య నవీన్, జగన్ తిరుకండ్యూర్ సౌమిత్, ఆచి శ్రీనివాస్, పద్మావతి, చైర్మన్ శ్రీనివాస్, డైరక్టర్లు సంతోష్, నరేందర్, భక్తులు పాల్గొన్నారు .


రుణాలకు అర్హులనే ఎంపిక చేయాలి

ఖానాపూర్: రాజీవ్ యువవికాసంతోపాటు ఇండస్ట్రీయల్ రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాల కోసం దరఖాస్తు చేసిన వారిలో నుంచి అర్హులను ఎంపిక చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూ రాబాద్ మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు, బ్యాంక్ మేనేజర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఈ నెల 20వ తేదీలోగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. జూన్ 2వ తేదీలోగా నూతన రుణాలు ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు, లక్ష్యం దిశగా ముందుకెళ్లాలన్నారు. మండలాల అధికారులు పాల్గొన్నారు.

టెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం

భైంసాటౌన్: ఉపాధ్యాయ కొలువుకు పోటీ పడే అభ్యర్థులు టెట్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ బి.మోహ న్‌రావ్ పటేల్ తెలిపారు. స్థానిక దారాబ్జి ఫ్యాక్టరీలో ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పా టు చేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రా రంభించారు. ఆయన మాట్లా డుతూ.. నియోజకవర్గ అభ్యర్థుల కోసం టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పే ర్కొన్నారు. సద్వినియోగం చేసుకుని, ఉపాధ్యా య కొలువులు సాధించాలని ఆకాంక్షించారు.

'పది' టాపర్లకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో అధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పా ఠశాలకు చెందిన 56 మంది విద్యార్థులు 500ల కు పైగా.. 21 మంది విద్యార్థులు 540కి పైగా మార్కులు సాధించారని హెచ్ఎం నరేందర్‌రావు తెలిపారు. అనంతరం వీడీసీ సమక్షంలో ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు.

నర్సరీ మొక్కలపై పట్టింపేది?



ఎండిపోతున్న మొక్కలు



నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మొక్కలు

ముధోల్: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు దెబ్బతింటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల పక్కన ఉన్న నీటి ట్యాంకు నిండి నర్సరీలోకి భారీగా నీటి ప్రవాహం రావడంతో సుమారు మూడు వేల మొక్కలు చనిపోయాయి. ఇందులో కొన్ని ఎండిపోగా.. మరికొన్ని మొక్కలు మట్టి కవర్ల నుంచి కొట్టుకుపోయాయి. వచ్చే వర్షాకాలం నుంచి పంపిణీ చేయాల్సిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యంతో దెబ్బతిన్నాయి.

ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఖానాపూర్ ఎంజేపీ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంతోష్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్నామని.. ఆసక్తి కలిగిన వారు ఈనెల 12లోగా సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరం ప్రారంభిస్తున్న ఎంఈఓ మధుసూదన్



తానూరు: వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

సారంగపూర్: పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మధుసూదన్ అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలో శుక్రవారం ఆయన వేసవి శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, కార్యమ్ ఆటలతోపాటు కుట్లు, అల్లికలు తదితర అంశాలపై నెలరోజుల ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్, ట్యూటర్ స్వరూపారాణి, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం రాజు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపును ఆయన పరిశీలించారు. ఉదయం వచ్చి ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే విద్యార్థులను ఇళ్లకు పంపాలని వలంటీర్‌కు సూచించారు. లక్ష్మణచాంద, తిర్పెల్లి, చామన్‌పెల్లి గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీడీ శ్రీనివాస్, సీఆర్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో శుక్రవారం 50 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం మల్లన్న మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల పోటీలు, నృత్యం, చిత్రలేఖనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సురేఖ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం శుభ పరిణామం

భైంసాటౌన్: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం శుభ పరిణామమని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద మాట్లాడారు. కులగణన నిర్ణయం బీసీల పోరాటానికి చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. కులగణనను చట్టబద్ధంగా, శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఆయన వెంట పలువురు బీసీ నాయకులు లక్ష్మణ్, గంగాధర్, సాయన్న, రాజన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఎల్‌వోసీ అందజేత

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన బండి మధుకర్– శిరీష దంపతుల కుమారుడు మనస్విత్(7) అనే చిన్నారి పుట్టుకతో మూగ, చెవిటి (కాక్లియర్ ఇన్ ప్లాంటేషన్ వ్యాధి)తో బాధపడుతుండగా.. ఆపరేషన్ కోసం రూ.8లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు. ఇటీవల చిన్నారిని తీసుకొని హైదరాబాదు కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో చికిత్స కోసం తల్లిదండ్రులు వెళ్లారు. బాబును పరీక్షించిన వైద్యులు నయం అయేందుకు రూ.18 లక్షలు అవుతుందని పేర్కొన్నారు. పేద కుటుంబం కావడంతో దంపతులు మంత్రి సీతక్కను కలిసి తమ దీన స్థితిని వివరించారు. స్పందించిన మంత్రి సీతక్క రూ.ఎనిమిది లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి శ్రీహరిరావు చేతుల చిన్నారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ సర్పంచ్, పాపాయిగారి రాంరెడ్డి, అమృత్‌రాజ్, బోసి మహేందర్, బండి మహేందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతల క్షీరాభిషేకం



మామడలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మామడ: దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందుకు శుక్రవారం మామడలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల కన్వీనర్ రంజిత్‌కుమార్, నరేందర్‌రెడ్డి, ఆశన్న, శమంత్‌రెడ్డి, రాజు, వంశీ, మల్లేశ్, పవన్, అనిల్ పాల్గొన్నారు.
నర్సాపూర్(జి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయమని బీజేపీ మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్ అన్నారు. నర్సాపూర్ (జి) గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజేందర్, గుండోల్ల దత్తురాం, సమీన్, గంగారాం, సుధాకర్, పల్లపు రాజు, రవీందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని శ్రీభక్త మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శివపార్వతుల కల్యాణానికి ఆలయ కమిటీ చైర్మన్ బిట్లింగ్ నారాయణ, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం 11.10 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేడుక నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మన్ బిట్లింగ్ నారాయణ, సభ్యులు శ్రీనివాస్, రజనీకాంత్, రాజేశ్వర్, గంగాధర్, సాగర్, పూజారులు తదితరులు పాల్గొన్నారు.